వరచుకున్న భాషా పరిచయంతో ఆప్టేజీ ఒక సమగ్ర సాహిత్య చరిత్ర రచించారు. ఇటువంటి ప్రయత్నాలు ఎన్నో జరగాలి.

విభజనతో వేరుపడగానే ఆంధ్రులకు రావలసిన విజ్ఞానభాగాలు అనేకంఉన్నవి. పెద్ద గ్రంథాలయాల్లో గ్రంథాలు, మ్యూజియంలో ముఖ్య వస్తువులు, ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోభాగం వన్నీ రావాలి. అవి వచ్చినా, రాకపోయినా ఆంధ్రదేశానికి కేంద్రంలో ఒక మ్యూజియం, ఒక ఉత్తమ గ్రంథాలయం ముఖ్యావసరాలు. వీటిని స్థాపించడానికి మన విద్యావేత్తలు, విజ్ఞానవేత్తలు సరియైన కృషిచేస్తారని ఆశిద్దాం!

నందన సంవత్సరంలో మొత్తంమీద జరిగిన సాహిత్యకృషికి మనరచయితలూ, పఠితలూకూడా గర్వించవలసిందే. రచనలు సంఖ్యలోనే గాక గుణంలోకూడా ఆధిక్యత సంపాదించుకొన్నవి.

నేటి పత్రికల ప్రచారసంఖ్య పెరిగేకొద్దీ, అన్నిచోట్ల స్థాపితం అవుతూవున్న పాఠశాలల, కళాశాలల విద్యాలయాల సంఖ్య పెరుగుతూన్న కొద్దీ విద్యావంతుల సంఖ్య కూడా పెరుగుతూ ఉంది, సాహిత్యం అంటే చెవి కోసుకొంటున్నారు. పత్రికలతోపాటు సభలవల్ల సమితులవల్ల విజ్ఞానప్రచారం జరుగుతూఉంది. నేడు ఎక్కడ చూచినా అమితమైన సాహితీ చైతన్యం కనిపిస్తోంది. చదువరులలో, సభాసదులలో జిజ్ఞాస బయలుదేరింది.

కవిత అనే దాహం, సౌందర్యపిపాస బహుముఖాల ప్రజ్వరిల్లుతోంది. వీటిని తీర్చవలసిన బాధ్యత రచయితలమీద ఉంది. అలాంటి సమయంలో ఆనందదాయకమైన నందన సంవత్సరం గతించి పచ్చతోరణాలతో విజయ సంవత్సరం వచ్చేసింది. అనేక శుభావకాశాలనందిస్తూ ఉంది. రచయితలు యీ శుభముహూర్తంలో యీ సదవకాశాల్ని వినియోగించుకొని విజయవత్సరాన్ని విజయప్రదం చేసుకోవాలి.

(సమాప్తం)

---

కథానిక

# వైతరణిలో ఈతగాళ్లు

అర్. యం. చిదంబరం

బూజుపట్టిన కిటికీలోంచి దిన కరుడి కిరణాలు గదిలోకి ప్రవేశించాయి. అక్కడే నిలబడి గుడ్డను కొరుకుతున్న ఎలుకకు కించిత్తయినా భయం కలుగలేదు. ఒక ప్రక్క మట్టికూజా. దానిమీద మూతగా పెట్టిన పుస్తకాన్ని ఎలుక త్రోసేసింది. ఇంటికప్పులో రెక్కలకోసం ఎగిరే జీవులకోసం కాసు కూర్చున్న సాలీడు ఆ నీటిలో పడింది. ఆ గదికి వేరే కిటికీలు లేకపోయినా బాధలేదు. మూషికాలు శ్రమలేకుండా, కానీ ఖర్చులేకుండా గోడనిండా కిటికీలు అమర్చిపెట్టాయి. ఇంటి కప్పుమీది కొన్ని తాటాకులు విహారంకోసం వాయుదేవుడి వెంటపోవటంవలన ఇంటి కప్పులోకూడా ఓ కిటికీ ఏర్పడింది.

రామస్వామి మంచంమీద కదిలాడు. మరోసారి అలా కదిలితే త్రాళ్ళన్నీ పుటుక్కున తెగి రామస్వామి పాతాళంలో పడతాడు. అంత క్రొత్తదా మంచం-వెలుతురు కళ్లల్లోకి పొడుచుకు రావటంవలన కళ్లు మూతపడలేదు. లేచాడు. ఒళ్లు బద్ధకంగా విరుచుకున్నాడు. "దిక్కుమాలింది. అప్పుడే తెల్లారింది!" అని విసుక్కున్నాడు. కళ్లు రెండూ సారాతాగినవాడి కళ్లల్లాగున్నాయి. నెమ్మదిగా తలుపుతీశాడు. పాతతలుపు "కిర్రున" చప్పుడు చేసింది. భళ్లున తలుపుతీస్తే ఆ రెక్క చేతిలోకి ఊడివచ్చేది. అన్నీ తెలిసినవాడు కనుక జాగ్రత్తగా తలుపుతీశాడు. బయటికివచ్చి ఓసారి చూచాడు. బిలబిలమంటూ జనం రోడ్డుమీద నడుస్తున్నారు.

"అమ్మో! ఎంతెండ వచ్చేసిందో! ఏడన్నా అయుంటుంది" అనుకుంటూ ఎదురింటి అబ్బాయి దగ్గరకు వెళ్ళాడు. ఆ అబ్బాయి "పరోపకారం" పాఠం చదువుకుంటున్నాడు. "టైమెంతయిందో కొంచెం చెబుతారా?" అని అతి వినయంతో

అడిగాడు. ఆ అబ్బాయి వినపడనట్టుగా తన పాఠం తాను చదువుకు పోతున్నాడు. రామస్వామి మళ్ళీ అదే ప్రశ్న చేశాడు.

"ఏడుంపావు. రోజూ ఇలాగా వేపుకు తినక పోతే ఓ గడియారం కొనుక్కో కూడదూ?"

తన "డొక్కు" గడియారంవంక గర్వంగా చూస్తూ అన్నాడు.

రామస్వామికి దుఃఖం పొంగుకొచ్చింది. అందరూ తనను దుయ్యబట్టేవాళ్ళే! తను మనిషి కాదేమోనన్న సందేహంకూడా కలిగింది. అంతా తన ఖర్మనుకుని గదిలోకి వెళ్ళి ఓ తువ్వాలు చుట్టుకుని మరో తువ్వాలు బుజాన వేసుకుని నూతి దగ్గరకు స్నానానికి బయలుదేరాడు. కాని తనకు బాల్చీ లేదుగా! పక్కింటి ముసలమ్మదగ్గరకు వెళ్ళి "అమ్మా! ఓసారి మీ బాల్చీ యిస్తారా? ఇప్పుడే ఇస్తాను" అన్నాడు. ఆమె భూమి కన్నంపడేట్టు బాల్చీని నేలమీద పెట్టి అతను దృష్టిపథంనుండి దూరంకాగానే "దిక్కుమాలినవాళ్లు. అందరికీ మా సామానే కావాలి" అంది. ఈ మాటలు రామస్వామికి వినిపించకపోలేదు. కాని ఏం చేస్తాడు? తన అసమర్థతని తననూ నిందించుకున్నాడు.

నూతిదగ్గరకు వెడుతుంటే "అబ్బ! వెధవ గుడ్డలు! శుచి శుభ్రం తెలియదు" అంది మరో కంఠం. అతను లోలోన ఏడ్చాడు.

త్వరగా స్నానం ముగించి బాల్చీ మామ్మకు అప్పగించి పరుగుపరుగున గదిలోకి పోయాడు. పాత ముతకపంచి కట్టుకున్నాడు. మేకుకు తగిలించిన ఖద్దరుచొక్కా తొడుక్కుని బయలుదేరే సరికి ఎండ బాగా వచ్చేసింది. ఆత్రంతో అతిరయంగా నడిచాడు.

రామస్వామి శ్రీమంతుడు వెంకన్న ఇంట్లో వంటవాడు. అతనికి పోటీగా లక్షమంది వంటవాళ్లు వెంకన్న ముందువాలినా అమాయకుడని, అసమర్థుడని, ఎద్దులా చాకిరీ చేస్తాడని, ఆత్మాభిమానం చంపుకున్నవాడని అతనికే ఆ ఉద్యోగమిచ్చాడు. రామస్వామి నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. అతని పుట్టినప్పటినుండి ఇప్పటివరకు ఇనుప గజ్జెలమోత వినిపిస్తూనే వుంది. ఆ మోత ఎంత కాలంవినిపిస్తుందో? గోడమీద క్రొత్త సినిమా పోస్టర్లు అంటించారు. రామస్వామి సినిమాకు వెళ్లాలని ఎన్నో యుగాలనుండి అనుకుంటున్నాడు. కాని తీరికేది? గానుగెద్దులా చాకిరీచేసి ఇంటికి వచ్చేసరికి ఎంతలేదన్నా పదిన్నరవుతుంది. తెల్లవారేసరికి అక్కడ హాజరుకావాలి. లేకపోతే ఉద్యోగం ఊడిపోయే బెదిరింపులు అదేపనిగా వచ్చి పడతాయి.

అతనికెదురుగా యువకదంపతులు ముసిముసి నవ్వులతో వస్తున్నారు. వాళ్ళ చేతిలో ఉన్న సామానునుబట్టి వారు రైలుస్టేషనుకు వెడుతున్నారని ఊహించుకున్నాడు. అతని కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. నలభయ్యో పడిలో పడ్డాడు. కాని సంసార సౌఖ్యమంటే యేమిటో యెరుగడు. అందుకు తను నోచుకోలేదు. అన్ని విధాలా అతనితో సరితూగగల అతనిమిత్రుడొకడు ఉబలాటపడి ఓ ఎర్రటి పిల్లని కట్టుకున్నాడు. కానివారం తిరక్కుముందే మరోడితో ఎగిరిపోయింది. అవును మరి. తెల్లారేసరికి పనికిపోతాడు. అర్థరాత్రి యింటికి వస్తాడు. బడలికచేత గొడ్డులా నిద్రపోతాడు. ఇక సంసారంచేసి ఏడిసేదేమిటి? ఈ వాలకం కనిపెట్టిన క్రొత్తపెళ్లాం లాభం లేదనుకుని రైలెక్కింది. ఆ గతే తనకూ పడుతుందని అతనికి బాగా తెలుసు. ఏ దరిద్రుడో కావాలంటే పిల్లనిస్తాడు. సగం జీవితం గడిచేపోయింది. గుండె ఏనాడో బీట వేసింది. ఈ గుండె ద్రవించి ద్రవించి చివరకి సముద్రంలో కలిసిపోతుంది. అదే అంతిమఘట్టం. అదీకాక తనకు వచ్చే జీతం పాతిక రూపాయలు. దాంతో భార్యను కూడా ఎలా పోషిస్తాడు? సంసార సౌఖ్యమంటే యేమిటో అతనికేం తెలుసు? "చెక్కిలి గుంటల ప్రణయరసము-సగము విరిసిన పెదవుల సందు నగవు-వలపు తేనెలొలికే నయన సుమాలు..." ఇలాంటివి గ్రంథాల్లో చదివి ఆనందించటమే అతని పని. అందుకు కూడా నూటికి తొంభై రోజులు తీరికుండదు. ఇవన్నీ జ్ఞప్తికివచ్చినపుడు పిచ్చివాడిలా నవ్వుకుంటాడు.

వెంకన్నగారి బంగాళా వచ్చేసింది. ఆవరణ దాటిపోయేలోగా వెంకన్న ఆపేశాడు. "ఏమండీ! ఇంత ఆలస్యంగా వస్తే ఎలాగ? ఎనిమిదయిపోయింది. రోజూ నే నిలాగ వాగుతూండటం-మీరు గాలిలోకి వదలుతూండటం-అలవాటైపోయింది. ఇదేం బాగాలేదు.

ఇలాగైతే మేము లేలే మనిషిని చూసుకుంటాం" అన్నాడు.

భారతదేశం "వంటవాళ్ళకు" మాత్రం గొడ్డుపోలేదని వెంకన్నకు బాగా తెలుసు!

"ఇవాళ...ఏదో...అయిపోయింది. రేపటినుండి వేళకివస్తా" అనేసి ఇంట్లోకి వెళ్ళాడు.

"అమ్మగారు" కాఫీ తాగేసి "నవల" చదువుకుంటోంది. రామస్వామి ఆమె ముందు చేతులు కట్టుకుని నిలబడి "ఇవేళ ఏం వండమంటారు?" అనడిగాడు.

"ఇంట్లో ఏముంటే అది వండండి" అని దృష్టిని మళ్ళీ పుస్తకంలోకి పోనిచ్చింది.

రోజూ ఇంతే. అడక్కుండా ఉన్న వాటితో వండితే "అడిగి వండరాదూ? ఈ కూర ఆయనకు నచ్చదు" అనొకసారి "ఈకూర అబ్బాయికినచ్చదు" అని మరొకసారి-ఇలాగ రకరకాలుగా ప్లేటు తిరగేస్తుంది.

వెళ్ళి పొయ్యి రాజేశాడు. ఎంత ఊదినా కట్టెలు మండలేదు. ఇప్పటికి రామస్వామి ఎంత ఘనపరిమాణంకల పొగత్రాగాడో కొమ్ములు తిరిగిన శాస్త్రజ్ఞులుకూడా అంచనా వెయ్యలేరు. ఈ ఎండకాలంలోకూడా ఆ ఉదారహృదయులకు పచ్చికట్టెలు ఎక్కడ దొరుకుతున్నాయో? లేక దేవుడు తనకోసం స్పెషల్‌గా పంపించాడా? అలాగే బాధపడుతూ మడికట్టుకుని వంట కానిస్తున్నాడు.

గడియారం తొమ్మిదికొట్టింది.

స్కూల్లో చదువుకుంటున్న వెంకన్న కొడుకు భోజనానికి తయారుగా వంటింట్లోకి వచ్చాడు.

"ఇంకా తొమ్మిదే కదండి అవుత! మీ స్కూలు పదింటికేగా! ఇంకా వంట కాలేదు" అన్నాడు రామస్వామి.

"నాకు ఆకలేస్తోంది" అన్నాడు అబ్బాయి.

"ప్రొద్దున్న ఎన్ని ఉప్మా ప్లేట్లు ఖాళీ చేశాడో!" అనుకున్నాడు రామస్వామి. తల్లి "నవల" అక్కడ పారేసివచ్చి "పిల్లాడి ఆకలి మీకేం తెలుస్తుంది?" అంది.

నిజమే! పిల్లలంటే తను ఎరుగును కను నా? పిల్లల మనస్తత్వాన్ని ఎలాగ అర్థంచేసుకోగలడు? ఇలాగ నైరాశ్యంలోపడి క్రుగ్గవలసిందేగా మోలు! రామస్వామికి మళ్ళీ ఏడుపువచ్చింది. అతనికిలాగ ఏడవటం అలవాటే. లోకం అతన్ని "అసమర్థు"డంటుంది. నిజమేనా? చచ్చిచెడి పదిగంటలలోగా వంట ముగించాడు. "అబ్బాయిగారు" భోంచేసి స్కూలుకు పోయారు. అయ్యగారు పదకొండు గంటలకు, అమ్మగారు పన్నెండుగంటలకు తిండి తిన్నారు. రామస్వామి భోంచేసి వంటిల్లంతా సర్దాడు. కొన్ని అంట్లుకూడా తోమాడు.

"ఇవాళ కందులు విసరాలి, మరచిపోయారు కనుక" అని ఆజ్ఞ పురమాయించి అమ్మగారు శయనాగారానికి పోయింది.

"కుంచెడు కందులూ విసరాలిసిందే! లేకపోతే తల తెగిపోతుంది" అనుకున్నాడు రామస్వామి. ఆ పనికూడా పూర్తిచేశాడు.

ఎప్పటిలాగే రాత్రి వంటకు సాయంత్రమే ప్రయత్నాలు ప్రారంభించాడు. వంటపూర్తయేసరికి రాత్రి ఎనిమిదయింది. తొమ్మిదింటికి కాని తిండికి రారని అతనికి తెలుసు—అందుకని ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. కాని ఆవేళ గబగబా భోజనాలు అయిపోయాయి. రామస్వామిని ఆనందం పెల్లుబికింది, "ఇవేళ త్వరగా పనయిపోయింది రెండో ఆట సినిమాకు వెడితేనో" అనుకున్నాడు. కానిడబ్బులులేవన్న సంగతి వెంటనే జ్ఞప్తికివచ్చింది.

తిన్నగా వెంకన్న దగ్గరకు వెళ్ళాడు.

"జీతం ఇస్తారండీ?" అనడిగాడు నెమ్మదిగా.

"రేపిస్తాను" అన్నాడు నిర్లక్ష్యంగా. తనను నిలదీసి అడుగలేడని ఎలాగా వెంకన్నకు తెలుసు. అందుకే ఈ పొడిగింపు-ఆపై దబాయింపు!

"నిన్న మంగళవారం కనుకఇవ్వను. రేపిస్తానని అన్నారుకదండి" అన్నాడు రామస్వామి-మొదటిసారిగా యజమానినిలాగ అడిగినందుకు అతనికే ఆశ్చర్యమేసింది.

"ఇంకా జీతంరాలేదు - ఉంటే ఇవ్వటానికి నాకేంపోయింది?" అనేసి ఇంట్లోకి పోయాడు.

"గోడమీద రేపని రాసుకోవాలి గాబోలు-త్వరగా పనయింది. సినిమాకు పోదామనుకుంటే అదీలేకుండా పోయింది." అనుకుంటూ రామస్వామి దివాలాతీసిన ముఖంతో ఇంటిదారి పట్టాడు. మళ్ళీ ఎప్పటిలాగే లేస్తాడు-యథాప్రకారంగా ప్రవర్తిస్తాడు...కాని దమ్మిడీ ఎత్తంత సుఖంకూడాలేని అణాకానీ బ్రతుకు అతనిది.